

# ఒక దెయ్యంతో నా ప్రేమకథ

– డా.యండమూరి వీరేంద్రనాథ్



అంకితం

అపరాధ పరిశోధన (డిటెక్టివ్) నవలని తెలుగు పాఠక లోకానికి పాపులర్ చెయ్యటంలో ఆద్యుడు

**కొమ్మూరి సాంబశివరావు కి**

\- రచయిత

## కృతజ్ఞతలు:

దెయ్యం తపున ఒక లాయరు కేసు టేకప్ చేసిన కథాంశం తో నవల వ్రాయమని సూచన ఇచ్చిన ప్రముఖ దర్శకుడు కృష్ణవంశీ, మానసిక వ్యాధుల నిపుణుడు డాక్టర్ ఇండ్ల విశాల్, రాగమాలికల వివరణ చెప్పిన గొర్తి బ్రహ్మానందం, పురాణ, ఇతిహాసాసాల గురించి వివరించిన బాలాంత్రపు రమణ, ఇంటరాగేషన్ విధానాల గురించి వివరించిన రిటైర్డ్ ఐ.పి.యస్ ఆఫీసర్ శ్రీరావులపాటి సీతారామారావు, లీగల్ సమాచారం అందజేసిన లాయర్ గోపాల్ సింగ్, ఫేస్-బుక్ గురించి వివిధ వివరాలు చెప్పిన వి.వి.ఆర్.కిషన్, ఎ.ఐ. ఇన్ఫర్మేషన్ ఇచ్చిన అల్లాణి శ్రీధర్,

కలీమా, జకాత్ ల గురించి చెప్పిన ఖాదిర్ బాబు,ఎందఱో మహానుభావులు. అందరికీ కృతజ్ఞతలు.

...

ఇదో చందమామ కథ. ఆస్తిక-నాస్తిక-దెయ్యాల చర్చ వద్దు.

**- యండమూరి**

# (గతసంచిక తరువాయి)

10

## భక్తురాలి పై అత్యాచారం

*"ఊరి చివర గుళ్లో పూజలు నిర్వహించి ఇంటికి వెళ్తున్న ఒక యువతిని నల్ల బెంజ్ కారులో వచ్చిన ఇద్దరు వ్యక్తులు పక్క పొలాల్లోకి లాక్కెళ్లి దారుణంగా అత్యాచారం జరిపారు. వాళ్ళు గతంలో ఒకసారి అదే గుడికి వచ్చారని ఆమె కంప్లయింట్‌లో చెప్పింది. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు".*

పేపరు పక్కన పెట్టి కుర్చీలో వెనక్కి వాలాను. నిన్న ఆ అమ్మాయి బహుశా మా దగ్గర నుంచి డైరెక్టుగా పోలీసుస్టేషనుకి వెళ్లి ఉంటుంది. అన్ని పేపర్లలోనూ ఈ వార్త భగ్గుమంది. బల్ల మీద ఇంకా చాలా దినపత్రికలు ఉన్నాయి. ఈ పేపరు పర్వాలేదు. మిగతావి మరింత కథలు అల్లాయి. అన్ని ఛానల్స్‌లోనూ ఆమె భజన చేసిన గుడి, ఆమెని రేప్ చేసిన పొలం వీడియోలూ చూపించారు.

"రేపులు జరగటానికి విశాలమైన కారులే కారణం" అంటూ ఒక ఛానెల్, బెంజ్ కారు తయారు చేసిన '*కార్ల్ బెంజ్*' జీవిత చరిత్ర ప్రసారం చేసింది. "రేప్ కాబడిన భక్తురాలి చీర ముక్క" అంటూ, ఏడాది క్రితమెప్పుడో పొలంలో వేలాడ గట్టిన దిష్టిబొమ్మ తాలూకు గుడ్డ పీలికని చూపించింది మరొక చానెల్. '**ఎండిపోయిన పొలం – శిధిలమైన జీవితం**' అంటూ పనీ పాటా లేని నలుగురు స్వీయ ప్రకటిత ప్రముఖులతో మరొక చానల్ చర్చా కార్యక్రమం పెట్టింది.

ఇక ఫేస్‌బుక్, టెలిగ్రాం విషయాలకి వస్తే, 'భక్తురాలు... నిష్టగా పూజలు చేసేది... అవివాహిత...' అంటూ సోషల్ మీడియా మొత్తం కామెంట్లతో నిండిపోయింది. 'భక్తులకి రక్షణ కల్పించలేని ప్రభుత్వం రాజీనామా చెయ్యాల'ని కొందరు వ్రాస్తే, 'రాష్ట్రంలో ఉన్న బెంజి కారులన్నీ తగల బెట్టాల'ని మరొకరు సలహా ఇచ్చారు.

దేశ ప్రజల సౌభాగ్యం కోసం నా వంతుగా నేను కూడా ఇన్‌స్టాగ్రాములో ప్రజలకి ఏదైనా సలహా ఇద్దామని ఆలోచిస్తూ ఉండగా, చెవి పక్కన "హలో" అని వినిపించింది.

వచ్చిందెవరో అర్థమై "మళ్ళీ వచ్చావా" అన్నాను.

"అవును. ఈసారి మెటీరియలిస్టిక్ స్వార్థంతోనే వచ్చాను. ఆ రేప్ చేసిందెవరో నాకు తెలుసు. ఆనాడు ద్రోణాచార్యుడికి గురుదక్షిణ ఇచ్చిన ఏకలవ్యుడిలా నువ్వు మీ తెలుగు మాస్టారికి న్యాయం చెయ్యవచ్చు. 'నా కేసు..' లో నువ్వు నాకు సాయం చేస్తానంటే 'ఈ కేసులో..' నేన్నీకు సాయం చేస్తాను. నేను చెప్పే సాక్ష్యాధారాల సాయంతో నువ్వీ కేస్ సాల్వ్ చేస్తే, నీ జీవితం ఊహించని మలుపు తిరుగుతుంది."

అతని మాటలు పూర్తి కాకుండా, “జీవితం మలుపు తిరగటం అంటే ఏమిటి?” అని అడిగాను.

“ఇంతకన్నా ఆనందంగా ఉంటావు”.

“చూడూ. ప్రజలు ఆనందంగా ఉన్న దేశాల ఇండెక్స్‌లో ఫిన్లాండ్ మొదటిది. మన దేశంలో ఆనందంగా ఉన్న ప్రజల ఇండెక్స్‌లో నేను ప్రథముడిని. నా జీవితానికి ఇంకే మలుపులూ అవసరం లేదు”.

“ఇంకా ఆనందంగా ఉండటం అంటే ఏమిటో తెలియని ప్రతివాడూ అలాగే అనుకుంటాడు”.

“వ్యక్తిత్వ వికాస నిపుణులందరూ అదే చెబుతారు. మా స్వామిజీ కూడా అలాగే చెప్పి మా అమ్మా నాన్నలని బుట్టలో పడేశాడు”.

“ఒకసారి ట్రై చేయొచ్చు కదా. అన్నట్టూ స్వామీజీ అంటే గుర్తు వచ్చింది. నేను చెప్పేది వింటే, నీ కుటుంబాన్ని మీ స్వామీజీ ఉచ్చు లోంచి బయటకు తీసుకు రావచ్చు”.

కుర్చీలోంచి ఒక్కసారిగా ఎగిరి పడి “నిజమేనా? నిజంగా నిజమేనా? లేక నాతో పని చేయించు కోవటానికి ఇలా చెపుతున్నావా?” అని అడిగాను.

“దెయ్యాలు అబద్ధాలాడవు” అన్నది ప్రభాకర్ దెయ్యం.

”సరే. ఏ పుట్టలో ఏ దెయ్యం ఉన్నదో. నువ్వు చెప్పాల్సింది ఏమిటో చెప్పు. బాగుంటే ఆలోచిస్తాను”.

“ఆ అమ్మాయిని పొలాల్లో రేప్ చేసింది...” అంటూ చెప్పడం ప్రారంభించాడు. విభ్రాంతుడనై విన్నాను. ఆరోజు జరిగింది ఏమిటో... రేప్ చేసిన వారు ఎవరో తెలుస్తున్న కొద్దీ తల గిర్రున తిరగ సాగింది.

## – 11 –

**‘వాళ్ళు’** వచ్చారని రామకృష్ణ చెప్పాడు. పంపించమన్నాను. అద్భుతానంద బాబా, కుప్పుస్వామీ, అతడి కొడుకు సుకుమార్–కమ్–భ్రమరహాసన్ లోపలికి వచ్చారు.

“ఎందుకు నాయనా రమ్మన్నావు?” డి.కే. బాబా ఎదురు కుర్చీలో కూర్చుంటూ అడిగాడు.

“చిన్న పని ఉంది” అన్నాను.

ఎమ్మెల్యే కుప్పుస్వామి కోపంగా లేచి, “చిన్న పనా? దానికి నువ్వే నా దగ్గరకి రావచ్చుగా. నన్ను రమ్మని పిలుస్తావా?” అని అరిచాడు.

“నా పని కాదు. మీ పనే అంకుల్. నాకు చిన్న పని. మీకు పెద్ద పని...” తాపీగా అన్నాను.

దెబ్బ తిన్నట్టు చూసి తిరిగి కూర్చున్నాడు.

“మా నాన్నా మీరూ ప్రాణ స్నేహితులనీ, చిన్నప్పటి నుంచీ నన్ను ఎత్తుకుని పెంచారనీ, నా నిక్కర్లు కూడా మీరే తొడిగేవారనీ చెపుతూ ఉంటారు కదా. అటువంటి మీరు కష్టాల్లో ఉంటే, నేను సాయం చెయ్యాలనుకోవటం తప్పా?” అన్నాను.

కుప్పుస్వామి గతుక్కుమని “కష్టాలా? ఏమి కష్టాలు?” అన్నాడు.

మాట్లాడకుండా మౌనంగా ఉండిపోయాను. ఆయన మొహంలో టెన్షన్ కనపడింది.

“ఏం కష్టాలు?” అని మళ్ళీ అడిగాడు.

నేను మాట్లాడలేదు. ఇనుముకి కావలసిన షేపు రావాలంటే ముందు వేడెక్కాలి. ఎక్కుతోంది. అందుకే కాస్సేపు మౌనంగా ఉన్నాను. ఆ నిశ్శబ్దం భరించలేక ఆయన అలజడిగా “...గవర్నమెంటు సర్కిల్స్‌లో నా కన్నా నీకే ఎక్కువ పలుకుబడి ఉన్నది కదా. ఇంత అర్జెంటుగా పిలిచావంటే నీకేదో తెలిసే ఉంటుంది. ఏం తెలిసింది? ఆ ఢిల్లీ లిక్కర్ విషయంలో ఈ.డి. రైడ్ చేయబోతున్నట్టు సీక్రెట్ ఇన్ఫర్మేషన్ ఏదన్నా వచ్చిందా? లేక మైనింగ్ లైసెన్సుల గురించి న్యూస్ ఏమైనా తెలిసిందా? మా డ్రైవరు మర్డరు విషయమా?” అన్నాడు.

తన మీద ఇన్ని నేరాలున్నట్టుగా ఆయనకి ఇంత అనుమానం ఉన్నదని నాకు తెలీదు. నేనింకా మాట్లాడకపోతే ఆయనే మొత్తం తన నేరాల చిట్టా విప్పుతాడని, “నల్లబెంజి కారు గురించి” అన్నాను.

గబ్బిలం కదిలితే వినపడేటంత నిశ్శబ్దం ఆ గదిలో వ్యాపించింది. తండ్రీ కొడుకులు మొహాలు చూసుకున్నారు.

అప్పుడు నాకో విషయం అర్థమైంది. బెంజి కారు ప్రసక్తి రాగానే వారిద్దరూ అలా రియాక్ట్ అయ్యారంటే, ఇక్కడికి రాక ముందే ప్రొద్దున్నే పేపర్‌లో వచ్చిన ఈ వార్త గురించి వాళ్ళ మధ్య చర్చ జరిగిందన్నమాట..!

నా అనుమానం ధృవపడే సరికి భ్రమరహాసన్ వైపు తిరిగి, “ఏం సుక్కూ... మీ బిజీ నాన్నగారినీ, అంతకన్నా బిజీ బాబాజీని మా ఇంటికి పిల్చేటంత పెద్ద కేసే కదా ఇది” అని తిమిరంలో వరుణాస్త్రం వదిలాను.

“ఆ రోజు నేను ఈ ఊళ్ళో లేను” అన్నాడు సుకుమారు.

“అదేమిటి సుకుమార్? నేను ఏదో అడుగుతూంటే నువ్వేదో చెపుతున్నావు. నల్లబెంజ్ కారుకీ, నువ్వా రోజు ఊళ్ళో లేకపోవటానికీ సంబంధం ఏమిటి?” ఏమీ తెలియనట్టూ అన్నాను.

సుకుమార్ ఏదో చెప్పబోతూ ఉంటే బాబాజీ కల్పించుకుని, “పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం వెయ్యకు ఆనంద్. చాలు. నీ లాయరు బుర్రకి అతడు తూగడు గానీ, అసలేమి జరిగిందో చెప్పు” అన్నాడు కటువుగా.

"ఒక అమ్మాయికి అన్యాయం జరిగింది".

అప్పటివరకూ నిశ్శబ్దంగా ఉన్న కుప్పుస్వామి మొహం చిట్లించి, "ఆ విషయం చెప్పటానికి పిలిచావా? దేశంలో ఎందరో ఆడోళ్ళకి.." అని ఏదో అనబోతూ ఉంటే, స్వామీజీ విసుగ్గా "నువ్వాగు కుప్పూ" అని నా వైపు తిరిగి, "నీ దగ్గర దాచేదేముంది నాయనా? ఏదో కుర్రాడు. తప్పు చేశాడు. ఏమైనా సాక్ష్యాలు దొరికాయా? ఎందుకు పిలిచావు? చెప్పు బాబూ. మంత్రిగారు నీ ఋణం ఉంచుకోరు" అన్నాడు చివరి మాటల్ని ఒత్తి పలుకుతూ.

"పోలీసులకి ఆ అమ్మాయి నల్లబెంజి అని మాత్రమే చెప్పింది కానీ, నిజానికి ఆమెకి మీ కారు నెంబరు కూడా తెలుసు. వాళ్లకి చెప్పలేదంతే" అన్నాను.

ముగ్గురి కాళ్ళ మధ్యలో బాంబు పేలిన ఫీలింగ్. మినిట్‌లో వెయ్యో వంతు మంత్రిగారు వణికినట్టూ అనిపించింది.

"ఇదంతా నీకెలా తెలుసు?" డి.కే. బాబా అనుమానంగా అడిగాడు.

"ఆ అమ్మాయి తండ్రి చిన్నప్పుడు మా టీచరు"

"ఆయన చిన్నప్పుడు మీ టీచరా?"

"సారీ. ఈమధ్య తెలుగు రాని రచయితల పుస్తకాలు చదువుతున్నాను. మా చిన్నప్పుడు ఆయన మాకు టీచరు. తండ్రీ కూతుళ్ళు ఇద్దరూ వచ్చి జరిగిందంతా చెప్పారు" అన్నాను.

కుప్పుస్వామి తల పట్టుకున్నాడు. భ్రమరహాసన్ మొహం ఎర్రపెనం మీద నల్ల దోసెలా మారింది. సుగంధ సుకుమార మరంద మాధురీ కుముద పూ–మకరందం గ్రోలుదామని, పొరపాటున దూలగుండాకు మీద వాలిన తుమ్మెదలా మెడ గోక్కున్నాడు.

ధైర్యంగా ఉన్నది డి.కే. బాబా ఒక్కడే.

"నువ్వేమీ భయపడకు కుప్పూ. అంతా నేను చూసుకుంటాగా" మంత్రిగారికి ధైర్యం చెపుతున్నట్టు అని, నా వైపు తిరిగి "పోలీసులు ఏమీ నిరూపించ లేరు. పేపర్‌లో బెంజి కారు విషయం రాగానే అన్ని ఏర్పాట్లూ చేసేశాము" అన్నాడు గర్వంగా.

"ఏమి చేశారు?"

"ఆ రోజు సుకుమార్ బాబు అసలీ ఊళ్ళో లేడు. ఢిల్లీలో ఉన్నాడు. హోటల్ రసీదులు కూడా ఉన్నాయి. అతడి స్నేహితుడు రాంబాబు ఆ రోజు రాత్రి నూట నాలుగు జ్వరంతో కే.పి.యస్. ఆస్పత్రి ఐ.సి.యు లో ఉన్నాడు".

"ఆ రసీదులు కూడా ఉన్నాయా?"

"ఉన్నాయి. కేసు విషయం తెలియగానే ఆగ మేఘాల మీద ఋజువులన్నీ తయారు చేయించాము" మినిస్టర్ కుప్పుస్వామి వైపు గర్వంగా చూస్తూ చెప్పాడు.

"అయితే ఇంకేం. దుర్యోధనుడి పక్క శకునిలా మీరుండగా సుకుమారు సురక్షితం" అన్నాను.

"అభినందిస్తున్నావా? సెటైరు వేస్తున్నావా?"

"పోనీ దశరథుడి పక్కన వశిష్ఠుడు అనుకోండి".

అప్పటి వరకూ మా సంభాషణ వింటున్న కుప్పుస్వామి చిరాగ్గా, "మీ పురాణ పాండిత్య ప్రకర్షలు మానేసి అసలు విషయానికి వస్తారా?" అని అరిచాడు.

"మీ అబ్బాయి ఢిల్లీలోనూ, రెండు చిడతల రాంబాబు ఐ.సి.యులోనూ ఉన్నాడని సాక్ష్యాలు ఏర్పాటు చెయ్యమని మీకు సలహా ఎవరు ఇచ్చారు?" అని మంత్రిగారిని అడిగాను.

"నేనే" అన్నాడు పక్కనుంచి స్వామి.

"పొద్దున్న పేపర్‌లో నల్లబెంజి న్యూస్ చూడగానే, రెండు గంటల్లో ఇన్ని ఏర్పాట్లు చేశారంటే మీరు నిజంగా చాలా గొప్పవారు స్వామీ. మీరు లాయర్ కాకపోవడం మా అదృష్టం" అన్నాను.

స్వామి గర్వంగా కాలర్ సర్దుకోబోయి, అది లేదని గుర్తొచ్చి మెడ నిమురుకున్నాడు.

"అన్నీ బాగానే చేశారు" అన్నాను. "...కానీ రేప్ జరగటానికి ముందు రోజు మీ అబ్బాయి ఢిల్లీ ఎలా వెళ్ళాడు? ట్రెయిన్‌లోనా? ఫ్లైట్‌లోనా? 'మినిస్టర్ కొడుకు' నార్మల్ సెకండ్ క్లాసు కంపార్ట్‌మెంటులో వెళ్ళాడా? రిజర్వేషన్ చార్టులో సుకుమార్ పేరు లేదని పోలీసులు నిరూపించరా? ఇకపోతే ఆ రెండు చిడతల రాంబాబు కే.పి.ఎస్. హాస్పిటల్లో ఉన్నాడని రికార్డుల్లో ఉన్నదన్నారు. కే.పి.ఎస్. అంటే కుప్పుస్వామి. ఆ హాస్పిటల్ కుప్పుస్వామిగారిది అని అందరికీ తెలుసు. అదీ గాక, ఐ.సి.యులో ఉన్న రాంబాబు అదే రాత్రి ఊరి చివర రోటరీ క్లబ్ హాల్లో మిమిక్రి ప్రోగ్రాం ఎలా ఇచ్చాడు?" అన్నాను.

సుకుమార్ మొహం వాడిపోయింది.

"త్రినేత్రి భజనలు చేసిన గుడి ఆ హాలు పక్కనే ఉన్నది. ప్రోగ్రాం పూర్తయ్యే సరికి బాగా రాత్రి అయింది. ఆ తరువాత వారిద్దరూ పొలం దగ్గర గంట సేపు ఉన్నట్టూ ఫోన్ సిగ్నల్స్ సంపాదించటం పోలీసులకి పెద్ద కష్టం కాదు".

కుప్పుస్వామి స్వామీజీ వైపు చూసిన చూపుకే గానీ శక్తి ఉండి ఉంటే, మా దిబ్బ కింద బాబా అక్కడికక్కడే మాడి మసై దిబ్బలో కలిసి ఉండేవాడు.

"బాబాగారూ. మీరిచ్చిన సలహాలు మావాడిని రక్షించేవా? డైరెక్టుగా ఉరికంబం ఎక్కించేవా?" అన్నాడు.

సబ్జెక్టు మార్చటానికా అన్నట్టు స్వామి, "మిమిక్రీ అంటే?" అని అడిగాడు.

"గొంతుల్ని ఇమిటేట్ చెయ్యటం" అన్నాను.

కుప్పుస్వామి కొడుకు వైపు తిరిగి "అయినా నీకిదేం పోయే కాలంరా? శుభ్రమైన బెడ్‌రూమ్ ఇంట్లో పెట్టుకొని పొలాల్లో రేప్ చేయటం ఏమిటి?" అన్నాడు పడగ్గదిలో చేస్తే పరవాలేదన్న అర్థంలో.

"అవన్నీ సైకలాజికల్ డిజార్డర్స్" అన్నాను.

బాబా మొహం చిట్లించి "అంటే?" అన్నాడు.

"వీపు క్రింద వరికంకులు గీరుకుంటూ ఉంటే మూడ్ రావటం *సైకో-సొమాటిక్-ఎరోటిక్-ఫాంటసీ*..! ఎదుటివారు గింజుకుంటూ ఉంటే సంతృప్తి పొందటం అగ్రెసివ్-శాడిస్టిక్-మసోఛిజం..! ఆడది ఏడుస్తూంటే బలవంతం చేయటం *అబ్సెసివ్ పెర్సనాలిటి డిజార్డర్...*" మొన్నటి సైకాలజిస్టు సాంగత్య పరిజ్ఞానంతో నాకు తెలిసిన పదాలన్నీ వాడాను.

మినిస్టరు నా వైపు అదోలా చూస్తూ "నా కొడుక్కి ఇన్ని రోగాలు ఉన్నాయని చెప్పటం నీ ఉద్దేశ్యమా?" అన్నాడు.

"నేను డాక్టర్‌ని కాను. లాయర్‌ని. మీరు సృష్టించుకున్న ఎలిబీలు ఎంత లూజుగా ఉన్నాయో, ప్రాసిక్యూషను వాటిని ఎలా క్షణాల్లో బద్దలు కొడుతుందో చెప్పటం నా ఉద్దేశ్యం".

"మరేం చేద్దాం?"

నేను మాట్లాడలేదు. అప్పటి వరకూ మౌనంగా ఉన్న బాబా సాలోచనగా "నాదో అనుమానం. డైరెక్టుగా వెళ్లి కారు నెంబరు పోలీసులకి చెప్పకుండా అసలా తండ్రీ కూతుళ్లు నీ దగ్గరకి ఎందుకొచ్చారు?"

అప్పటి వరకూ ఆ ప్రశ్న కోసమే ఎదురు చూస్తున్నాను.

వాళ్ళిద్దరూ పోలీసుల దగ్గరకి వెళ్ళకుండా మా ఇంటికి ఎందుకు వచ్చారో, వారు ఏమి ఆశిస్తున్నారో చెపుతూ ఉంటే భ్రమరహాసన్ మొహం వివర్ణమైంది.

నేను చెప్పటం పూర్తి చెయ్యగానే కుప్పుస్వామి కంఠం "...వ్హాట్?" అంటూ కీచుమంది. సాధారణంగా దేనికీ చలించనట్టూ పోజు పెట్టే మా డి.కే.బాబా కూడా కాస్త విచలితుడయినట్టు కనపడ్డాడు.

“కోటీ యాభై లక్షలా?” గొణిగాడు మినిస్టరు.

“ముందు రెండు కోట్లు అడిగారు” అన్నాను.

ఆయన ఆలోచనలో పడ్డాడు. ఒక్క భ్రమరహాసన్ మాత్రమే ‘పొలంలో రేప్‌కి అంత ఖరీదా?’ అని ఆలోచిస్తున్నట్టు అభావంగా ఉన్నాడు.

“ఆలోచించుకుని చెప్పండి. తొందరేమీ లేదు” మీరిక వెళ్ళొచ్చన్నట్టుగా అన్నాను కుర్చీలోంచి లేస్తూ. ఎవరి ఆలోచనలో వాళ్ళున్నట్టు ముగ్గురూ మౌనంగా లేచి బయటకి నడిచారు.

తిరిగి కుర్చీలో కూర్చున్నాను. ఎందుకో నా ప్లాను అంత సులభంగా సక్సెస్ అవుతుందని అనిపించలేదు కానీ స్వామీజీని దెబ్బ కొట్టానన్నది అదో తృప్తి.

అంతలో బల్ల మీద మాస్టారి కూతురు వ్రాసిన నోట్ పుస్తకాలు కనబడ్డాయి. నాకీ రచయితల మీద మంచి అభిప్రాయం లేదు. చిన్నతనంలో నాకో క్లాస్‌మేట్ కవి ఉండేవాడు. మా ఊరి చివర దిబ్బ మీద కూర్చుని–

“దిబ్బెక్కి వ్రాసినా, దిబ్బ కింద రాసినా
తగ్గదు నా కవిత గొప్ప. దీనబ్బ..!
తాటికల్లు ముంతయినా, విప్పసారా గ్లాసయినా
రుచి మారదు దాని పదం తప్ప”

– అంటూ కవితలు వ్రాసి, గాలిలో (మా మీదకి) వదిలేవాడు. అతడి కవితలు చదవటం వల్ల నాకు ఏర్పడిన ఒక రకపు నిరామయ నిరాసక్త అయిష్టభావంతో మాస్టారిగారి కూతురు వ్రాసిన పుస్తకం తీసుకొని పేజీలు తిప్పాను.

మొదటి పేజీలోని ఒక వాక్యం దగ్గర దృష్టి ఆగింది. ముందుకి వంగి మళ్ళీ చదివాను.

***“నేనో చిన్న కవిని. ఇంకా ఉదయించని రవిని”*** అని కనపడింది. నా లాయరు బుర్రకి సరిగ్గా అర్థం కాలేదు కానీ, ఇదేదో బావుందే అనిపించింది. మరో పేజీ తిప్పాను. ***“నీ చిరునవ్వు ముగ్గు కోసం, నిశ్శబ్దపు గడప మీద నే కూర్చుని ఉంటే... ప్రేమ కళాపి చల్లడానికి నువ్వింకా రాలేదేం మిత్రమా”*** అని ఉంది. ఇది ఇంకా బావున్నట్టా అనిపించింది కానీ, ప్రేమ కోసం పేడ కళాపి జల్లటం ఏవిఁటో అర్థం కాలేదు. అబ్బ దీనబ్బ. అర్థం అయితే చెప్పుతో కొట్టబ్బ.

**– 12 –**

**రోడ్డు** పక్కన ఎత్తుగా ఉన్న గట్టు మీద వరుస ఇళ్ళు రైలు పెట్టెల్లా ఉన్నాయి. వాటి మధ్యలో మాస్టారి ఇల్లు పట్టుకోవటం పెద్ద కష్టం కాలేదు.

నన్ను చూసి మాస్టారు ఆశ్చర్యపోయారు. “నువ్వు... నువ్వు... మా ఇంటికి వచ్చావా నాయనా... రా... రా... కూర్చుండ మా ఇంట కుర్చీలు లేవు” అన్నారు.

“కేసు ఎంత వరకు వచ్చింది మాస్టారూ?” కూర్చుంటూ అడిగాను. పక్కనే పిల్లల నోట్ బుక్స్ దిద్దుతోన్న త్రినేత్రి నా వైపు కనీసం కన్నెత్తి కూడా చూడలేదు.

“ఏం చెప్పమంటావు నాయనా. పోలీసులు అమ్మాయిని ఇప్పటికి పాతికసార్లు పిలిచారు. డాక్టర్లు నాలుగుసార్లు పరీక్షలు చేశారు. నేరం చేసినవాడు దొరకలేదు కానీ, నష్టం జరిగిన వారిని నానా ఇబ్బందులూ పెడుతున్నారు”.

‘అప్పుడే చెప్పాను కదా మాస్టారూ’ అనలేదు. *మనం చెప్పిన సలహా ఎదుటి వారు పాటించక నష్టపోతే, అసలే విషాదంలోనో, కష్టంలోనో ఉన్నవారితో ‘...నేను అప్పుడే చెప్పాను చూశావా’ అంటూ మన జ్ఞాన పాండిత్యాన్ని ప్రదర్శించటం శాడిజం* – అని నా ఉద్దేశ్యం.

“మీరు వీలైనంత త్వరగా ఈ విషయం మర్చిపోవటం మంచిది సార్” అన్నాను.

“మర్చిపోనివ్వరు బాబూ. ఈ పిల్లేమో పేరూ, అడ్రస్సుతో సహా తన వివరాలన్నీ చెప్పేసింది. దాంతో పరిచయస్తుల సానుభూతులు భరించలేక పోతున్నాం. ‘..అమ్మాయికి పెళ్లి ఎలా అవుతుందని’ ఒకరూ, ‘ఇప్పుడే బొప్పాయి కాయలు తినిపించండి. మన జాగ్రత్తలో మనం ఉండటం మంచిది’ అని మరొకరూ... ప్రతీ అడ్డమయినవాడూ సలహా ఇస్తున్నాడు. మీడియా వాళ్ళయితే. ‘ముందే పరిచయమా? అర్ధరాత్రి ఈమె వాళ్ళని లిఫ్ట్ అడిగిందా? ఎక్కించుకుని వాళ్ళు పొలాల్లోకి తీసుకెళ్లారా?’ అని ప్రశ్నల మీద ప్రశ్నలు. మరి కొందరు మైక్ తీసుకొచ్చి, పొలంలో అనుభవాలు చెప్పమంటారు”.

ఎన్ని రాత్రులు ఆయన నిద్ర లేకుండా గడిపి ఉంటారో ఆ స్వరమే చెపుతోంది.

“ఇంతకీ వాళ్లు దొరుకుతారంటావా బాబూ?”

“దొరికారండి” అన్నాను.

అప్పటివరకు నిర్లిప్తంగా వింటున్న త్రినేత్రి చప్పున తలెత్తి చూసింది.

“దొరికారా? ఎక్కడ దొరికారు? ఎవరు వాళ్ళు?” ఉద్వేగంగా ప్రశ్నల వర్షం కురిపించారు మాస్టారు.

“నా దగ్గరకే వచ్చారు. కేసు పెట్టకుండా కాంప్రమైజుగా కోటీ యాభై లక్షలు ఇచ్చారు.”

నా మాటలకి త్రినేత్రి చప్పున తలెత్తి చూసి కళ్ళు దించుకుంది.

“డబ్బు ఇవ్వటం ఏమిటి? కాంప్రమైజు దేనికి?” మాష్టారు ఆశ్చర్యంగా అన్నారు.

"రేప్ కేస్ లేకుండా..." అన్నాను.

నా మాటలు పూర్తి కాకుండానే త్రినేత్రి నా వైపు అదోలా చూస్తూ, "మీరు వాళ్ళ తరఫు లాయరా?" అని ప్రశ్నించింది.

నేను కూడా ఆమె వైపు అదోలా చూసి "ఛా.. ఛా" అని, స్వరం బలంగా లేదని మళ్ళీ ఇంకోసారి గట్టిగా "ఛా.. ఛా" అన్నాను.

"మీరు వాళ్ల లాయరు కాకపోతే, రేప్ చేసింది 'వాళ్ళే' అని మీకెలా తెలిసింది?"

దెయ్యం చెప్పిందని చెప్తే బావోదని, "వాళ్ళే నా దగ్గరకి వచ్చారు" అన్నాను.

"వాళ్ళు మీ దగ్గరకే ఎందుకొచ్చారు? మేము మీకు తెలుసని వారికి ఎలా తెలిసింది?"

'ఈవిడ లాయర్ అయ్యుంటే కోట్లు సంపాదించేది. పెళ్లి చేసుకుంటే మొగుడు ఆత్మహత్య చేసుకునేవాడు' అని మనసులో అనుకుని, ఆ ప్రశ్నకి పూర్తిగా సమాధానం చెప్పకుండా, "నల్ల కారు పట్టిచ్చింది" అన్నాను.

"ఆ నల్ల కారు వాళ్ళు ఎవరు?"

"ప్రస్తుతం అది అప్రస్తుతం" అన్నాను.

మాష్టారు మధ్యలో కల్పించుకుని, "అదేమిటి బాబు. వాళ్ళు ఎవరో తెలిస్తే పోలీస్ రిపోర్ట్ ఇవ్వాలి కదా" అన్నారు.

"ఆ మినిస్టర్ చాలా పలుకుబడి ఉన్న మనిషి. పోలీసులు ఏమీ చేయరు. అదీగాక ఆ రోజు ముద్దాయి ఊళ్ళో లేనట్టు వాళ్ళు చాలా బలమైన ఎలిబీలు ఏర్పాటు చేసుకున్నారు".

"అయినా వాళ్ళెవరో తెలియాలి కదా" తీవ్రంగా అన్నదామె.

"తెలిసినా ఏమీ చేయలేమని చెప్తున్నాను కదా" అంతే తీవ్రంగా నేనూ బదులిచ్చాను.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments